
సాక్షి బాపట్ల

సోమవారం । 30 । జూన్ । 2025



కనక దుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీనగర్‌లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో బోనాల సమర్పణ కార్యక్రమాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 514.20 అడుగుల వద్ద ఉంది. ఇది 138.9118 టీఎంసీలకు సమానం.

నిమ్మకాయల అలంకరణలో మహంకాళి అమ్మవారు



దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో ఉన్న శ్రీ మహంకాళి ఆలయంలో ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా అమ్మవారు నిమ్మకాయల దండల అలంకరణలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

వైభవంగా సుభద్ర అమ్మవారి శోభాయాత్ర



తాడేపల్లిరూరల్: తాడేపల్లిలో ఆదివారం అత్యంత వైభవంగా సుభద్ర అమ్మవారి శోభాయాత్ర జరిగింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా సుభద్ర అమ్మవారికి ఇస్కాన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో సారె సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సీతానగరం శ్రీమద్విరాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి వివిధ రకాల పూలు, సారెలతో ప్రకాశం బ్యారేజ్ మీదుగా విజయవాడ సీతమ్మవారి పాదాల వరకు యాత్ర కొనసాగింది. దారిపొడువునా యువతులు, చిన్నారులు కోలాటాలు, నృత్యాలతో అలరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన నాట్యం ప్రాక్టికల్ పరీక్షలు



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో మూడు రోజులుగా జరుగుతున్న సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. పరీక్షలకు 21 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షలకు అధికారిగా వ్యవహరించిన సుధీర్ రావు తెలిపారు. కళా పీఠం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ నట్టువాంగంతో, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి మృదంగంపై సహకరించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

గుణదల(విజయవాడ తూర్పు): సర్వమానవాళి రక్షణ ప్రణాళికలో భాగంగా ఏసు క్రీస్తు ఈ లోకానికి అరుదెంచారని, ఆయన మార్గం అనుసరణీయమని గుణదల మేరీ మాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం ఉదయం సమష్టి దివ్య బలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. అనుదిన ప్రార్థనతోపాటు భక్తి విశ్వాసాలను కూడా కొనసాగించాలని వివరించారు. దేవుడు బోధించిన ప్రేమ, జాలి, దయ వంటి సద్గుణాలను కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు.

అర్ధరాత్రి మట్టి తవ్వకాలు

స్థానికుల నిలదీతతో జారుకున్న దుండగులు



కొలకలూరు(తెనాలి): పంట పొలాల్లో మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్న వైనం శనివారం తెనాలి రూరల్ మండలం కొలకలూరులో జరిగింది. అక్రమ తరలింపును గుర్తించిన స్థానికులు అడ్డుకోవడంతో అక్కడి నుంచి దుండగులు జారుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. కొలకలూరు గ్రామ జగనన్న కాలనీ సమీపంలోని ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న పొలాల్లో శనివారం అర్ధరాత్రి తర్వాత కొందరు పొక్లెయిన్లతో మట్టిని తవ్వుతూ అక్రమంగా ట్రాక్టర్లకు ఎత్తి తరలించే యత్నం చేశారు. సమీపంలోని వారు నిద్రలేచి వచ్చి అధికారుల అనుమతి లేకుండా అర్ధరాత్రి మట్టి తవ్వకాలేమిటంటూ ప్రశ్నించారు. దీనికి తాము తమ పొలంలోని మట్టిని సరిచేసుకుంటున్నామని చెప్పగా, మట్టిని బయటకు తరలించటాన్ని తాము చూశామని, అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించటంతో వారు అక్కడ్నుంచి పొక్లెయిన్, ట్రాక్టర్లతో సహా జారుకున్నారు. దీన్నంతా వీడియో తీసి కొందరు మండల తహసీల్దార్‌కు పంపారు. తహసీల్దార్ ఆదేశాలపై గుడివాడ వీఆర్‌ఓ భాను ఉదయాన్నే మట్టి తవ్వకం జరిగిన ప్రాంతాన్ని సందర్శించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైళ్లలో భద్రతకు రెడ్ సిగ్నల్

రానురాను రైళ్లలో ప్రయాణికుల భద్రతకు రెడ్ సిగ్నల్ పడుతోంది. ఉత్తరాది దొంగలు ప్రమాదకర రీతిలో సిగ్నలింగ్ వ్యవస్థ ట్యాంపరింగ్ చేసి రైళ్లను ఆపేస్తున్నారు. రాత్రివేళ ఇలా రైలు ఆగగానే బోగీల్లో చొరబడి అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ పరిణామాలతో అటు రైల్వే అధికారులు, ఇటు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

- వల్నాడు ప్రాంతంలోని రైల్వే మార్గాలలో తరచుగా దోపిడీలు
- సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్ చేసి మరీ రైలును నిలిపేలా పక్కా ప్రణాళిక
- వారం వ్యవధిలో పిడుగురాళ్ల సమీపంలో వరుస ఘటనలు
- గాలిలోకి కాల్పులు జరిపి దొంగలను బెదరగొట్టిన రైల్వే పోలీసులు
- రాత్రి సమయంలో ప్రయాణాలంటేనే భయపడుతున్న ప్రజలు

వరుస దోపిడీలతో హడలెత్తిస్తున్న ఉత్తరాది దొంగల ముఠా



పిడుగురాళ్ల, నడికుడి ప్రాంతం మధ్యలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రదేశం

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో వరుస రైలు దోపిడీలు ప్రయాణికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రిపూట ప్రయాణిస్తున్న దూరప్రాంత రైళ్లను సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్, చైన్ లాగడం వంటివి చేసి స్టేషన్ల మధ్య నిర్మానుష్య ప్రాంతాలలో దొంగలు ఆపుతున్నారు. బోగీలలో చొరబడి బంగారు నగలు, నగదు, ఫోన్లు వంటి విలువైన వస్తువులను దోచుకుంటున్నారు. రైళ్లలో భద్రతా సిబ్బంది తక్కువగా ఉండటం, ఉన్నా కొందరి నిర్లక్ష్యంతో దొంగలు యథేచ్ఛగా ప్రయాణికులను దోచుకొని పారిపోతున్నారు. గతంలో క్రాసింగ్ కోసం ఆగినప్పుడు ప్రయాణికులను దోచుకునేవారు. రైల్వే స్టేషన్‌లో ఆగినప్పుడు దొంగలు కిటికీలలో చేతులు పెట్టి లోపలున్న ప్రయాణికుల విలువైన వస్తువులను లాక్కెళ్లేవారు. ఇటీవల కాలంలో మరింత బరి తెగించి సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్ చేస్తున్నారు. రైళ్లకు సిగ్నల్ దొరక్కుండా చేసి నిర్మానుష్య ప్రాంతంలో ఆగేలా చేస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారు. తాజాగా పిడుగురాళ్ల ప్రాంతంలో ఇదే తరహాలో దోచుకెళ్లారు.

సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్ చేసి..

తాజాగా శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో న్యూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న సిగ్నల్ వ్యవస్థను దుండగులు ట్యాంపరింగ్ చేయడంతో సిగ్నల్ పనిచేయక విశాఖ నుంచి చర్లపల్లి వెళుతున్న స్పెషల్ రైలు ఆగింది. ఇదే అదనుగా దొంగలు ఇద్దరు మహిళల నుంచి 50 గ్రాముల బంగారు గొలుసులు దోచుకున్నారు.

24 గంటలు గడవకముందే..

ఇది జరిగి 24 గంటలు గడవకముందే పిడుగురాళ్ల సమీపంలోని తుమ్మల చెరువు స్టేషన్ సమీపంలో మరో ఘటన చోటుచేసుకుంది. ఇందులో ఏకంగా రైల్వే పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపే వరకు వెళ్లిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు విశాఖ ఎక్స్‌ప్రెస్ వెళ్లే క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల ప్రాంతంలో రెండు కిలోమీటర్ల దూరంలో తుమ్మల చెరువు రైల్వే స్టేషన్ ఉండగానే స్లో అయింది. వెంటనే ఎస్‌ఐ వెంకటాద్రి తన సిబ్బందితో దొంగల వెంటపడ్డారు. విజిల్స్ వేయటం, లాఠీ శబ్దం చేయటం, లైట్లు వేయటంతో లైట్ ఫోకస్‌కు దొంగలు అప్రమత్తమై ట్రైన్ బోగీలో నుంచి దిగిపోయారు. దొంగలు రాళ్లు విసరడంతో ఎస్సై తన తుపాకీతో ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు. కానిస్టేబుల్ శేషయ్య తన 303 గన్‌తో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో దొంగలు పారిపోయారు. ప్రయాణికులకుగానీ, రైల్వే ఆస్తులకుగానీ ఎటువంటి నష్టం జరగలేదు. దొంగలు ఐదుగురు నుంచి ఏడుగురు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇదే ప్రాంతంలో 3 నెలల క్రితం కూడా ఓ దోపిడీ జరిగింది. గతేడాది ఆగస్టు నెలలో వరుసగా తుమ్మలచెరువు, నడికుడి ప్రాంతాలలో చెన్నై, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లలో దొంగలు దోచుకున్నారు.

హడలెత్తిస్తున్న ఉత్తరాది ముఠా

రైలు దోపిడీలు, దొంగతనాలు ఉత్తరాది దొంగల ముఠా పని అని జీర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన పార్థీ గ్యాంగ్, షోలాపూర్, మీర్జాపూర్, జామ్‌ఖేడ్, బీడ్ తదితర ప్రాంతాలకు చెందిన నేరస్థులు రైళ్లలో ఇలా దోపిడీలకు, దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. నేరాలు చేసే క్రమంలో వీరు చేస్తున్న రైల్ సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్ రైల్వే భద్రతకు ప్రమాదకరంగా మారుతోంది. దీని వల్ల ప్రమాదాలు జరగడంతో పాటు సిగ్నల్ వ్యవస్థ దెబ్బతిని రైళ్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పిడుగురాళ్ల, నడికుడి ప్రాంతాల్లో...

పల్నాడు జిల్లాలో కీలకమైన గుంటూరు–బీబీనగర్ లైన్‌లో ముఖ్యంగా పిడుగురాళ్ల, తుమ్మల చెరువు, నడికుడి స్టేషన్ల పరిధిలో దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతం నుంచి రాత్రి పూట మరీ ముఖ్యంగా తెల్లవారుజామున ఎక్కువ సంఖ్యలో రైళ్ల రాకపోకలు ఉంటాయి. ముఖ్యమైన రైల్వే స్టేషన్లు దూరంగా ఉండటంతో ఆయా ప్రాంతాలను టార్గెట్ చేసుకొని దొంగలు దోపిడీలు చేస్తున్నారు.



తుమ్మల చెరువు రైల్వే స్టేషన్

అవసరమైతే కాల్పులు

జీఆర్‌ఎఫ్ డీఎస్పీ అక్కేశ్వరరావు



పిడుగురాళ్ల: రైళ్లలో నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష తప్పదని గుంటూరు డివిజన్ జీఆర్‌ఎఫ్ డీఎస్పీ పి. అక్కేశ్వరరావు హెచ్చరించారు. రైల్వే పోలీస్ స్టేషన్లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైళ్లలో నేరాలను అరికట్టేందుకు గుంటూరు డివిజన్లో ఆర్పీఎఫ్, జీఆర్‌ఎఫ్ సంయుక్తంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ ట్రైన్లలో కొద్ది రోజులుగా ఏసీపీ(అలారం చైన్ పుల్లింగ్), సిగ్నల్ వ్యవస్థ ట్యాంపరింగ్ ద్వారా వేగంగా వెళ్లే ట్రైన్లను నేరగాళ్లు ఆపే ప్రయత్నం చేస్తున్నారని గుర్తుచేశారు. అయితే ఏ బోగీ నుంచి ఈ ట్యాంపరింగ్ జరిగిందనేది తమకు వెంటనే కచ్చితమైన సమాచారం వస్తుందని తెలిపారు. భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ తుమ్మలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే వేగంగా వెళ్తున్న ట్రైన్ ఒక్కసారిగా నెమ్మదించడంతో విధుల్లో ఉన్న గుంటూరు డివిజన్‌లోని తెనాలి ఎస్సై వెంకటాద్రి, కానిస్టేబుల్ శేషయ్య, తదితరులు అప్రమత్తం అయ్యారన్నారు. దొంగలు రాళ్లు విసరడంతో ఎస్సై, కానిస్టేబుల్ కాల్పులు జరిపారని తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని తనతోపాటు గుంటూరు డివిజన్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బి.శైలేష్ కుమార్ పరిశీలించారని తెలిపారు. డీఐజీ ఉత్తర్వుల మేరకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి హైదరాబాద్, నెల్లూరు తదితర ప్రాంతాలకు పంపినట్లు పేర్కొన్నారు. దుండగులను పట్టుకొని చట్టపరంగా తగిన శిక్ష పడేలా చూస్తామని తెలిపారు. దోపిడీలు, దొంగతనాలకు పాల్పడితే కాల్పులు జరిపైనా ప్రయాణికులకు రక్షణ కల్పిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రయాణికులకు, రైల్వే ఆస్తులకు ఎటువంటి నష్టం కలగకుండా కాపాడటమే తమ విధి అన్నారు. కార్యక్రమంలో గుంటూరు అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బి.శైలేష్ కుమార్, జీఆర్పీ సీఐ పి.కరుణాకర్ రావు, ఎస్‌ఐలు హుస్సేన్, మోహన్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.





బంగారు బోనంతో జోగిని శ్యామలాదేవి

బోనభాగ్యం

జగన్మాతకు తెలంగాణ బంగారు బోనం

- ఇంద్రకీలాద్రికి తరలివచ్చిన భాగ్యనగర్ బోనం
- 500 మందితో భారీ ఊరేగింపు
- ఆకట్టుకున్న కళాకారుల విన్యాసాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): తెలంగాణ హైదరాబాద్‌లోని భాగ్యనగర్ శ్రీమహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల కమిటీ తరఫున ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం బంగారు బోనాన్ని సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలతో రైతులు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ గత 16 ఏళ్లుగా ఏటా ఆషాఢ మాసంలో దుర్గమ్మకు బంగారు బోనం సమర్పించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి బోనాల కమిటీ ప్రతినిధులు, దుర్గగుడి ఈవో శీనానాయక్ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, బేతాళ నృత్యాలు, కళాకారులు విన్యాసాలు, వివిధ వేషధారణలు, పోతురాజుల విన్యాసాలతో వైభవంగా ఊరేగింపు ప్రారంభమైంది. తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ సుమారు 500 మంది కళాకారులు తమ కళలను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు.

భక్తుల బారులు..

జోగిని శ్యామలాదేవి బంగారు బోనాన్ని తలపై పెట్టుకుని ఊరేగింపులో ముందుకు సాగగా.. వెండి తదితర బోనాలతో మిగిలిన వారు అనుసరించారు. బంగారు బోనాన్ని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రి పరిసరాలకు తరలివచ్చారు. దుర్గాఘాట్‌కు చేరుకున్న ఊరేగింపు



ఊరేగింపులో తెలంగాణ సంప్రదాయ కళలను ప్రదర్శిస్తున్న కళాకారులు

కృష్ణమ్మకు గంగ తెప్పను సమర్పించిన పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించారు. అనంతరం దుర్గాఘాట్, ఘాట్‌రోడ్డు మీదుగా ఊరేగింపు ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.

సాదర స్వాగతం..

కళాకారులు, కమిటీ ప్రతినిధులు, భక్తులతో ఘాట్‌రోడ్డుపై పండుగ వాతావరణం కనిపించింది. ఆలయ ప్రాంగణంలోని గాలి గోపురం వద్ద బంగారు బోనానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఈవో శీనానాయక్, ఆలయ అర్చకులు, వేద పండితులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం బంగారు, వెండి బోనంతో పాటు పూజా సామగ్రి, పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలను ఆలయ ఈవో, ఆలయ అర్చకులకు అందజేశారు. అమ్మవారి దయతో ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎన్. రమేష్‌బాబు, వెంకటరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సీనియార్టీ లిస్టులు



కౌన్సెలింగ్ పేపర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని యూఎల్‌బీ పరిధిలో పనిచేస్తున్న వార్డు ఎమినిటీ సెక్రటరీలు, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ ఆదివారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. శనివారం వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే శనివారం జరిగిన కౌన్సెలింగ్‌లో ఎటువంటి సీనియార్టీ లిస్ట్ పెట్టకుండానే నచ్చిన సచివాలయాలను మూడు ఆప్షన్లుగా ఎంచుకుని ఆప్షన్ ఫాం ఇచ్చి వెళ్లిపోండి ఈనెల 30న మీకు సచివాలయం కేటాయిస్తామని అధికారులు చెప్పిన విషయం విదితమే.. దీనిపై 'సచివాలయ ఉద్యోగుల్లో ట్రాన్స్'ఫియర్'' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు రెండో రోజు జరగాల్సిన వార్డు ఎమినిటీ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్‌కు సంబంధించిన సీనియార్టీ లిస్టును ప్రచురించారు.

వార్డు అడ్మిన్లు వర్సెస్ బిల్ కలెక్టర్లు

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వార్డు/గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సచివాలయాలకు వార్డు అడ్మిన్ సెక్రటరీలతో పాటు గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లను కూడా వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా అవకాశం కల్పిస్తూ పోస్టింగ్ ఇచ్చారు. 2019లో బిల్ కలెక్టర్లకు వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా ముందు ప్రాధాన్యత కల్పించి పోస్ట్ కేటాయించారు. అయితే ప్రస్తుతం బదిలీల కౌన్సెలింగ్ జరగుతున్న నేపథ్యంలో బిల్ కలెక్టర్లు వారు ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయాల్లోనే ఉండేవిధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని హోల్డ్ చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో వార్డు అడ్మిన్ సెక్రటరీలు అలా హోల్డ్ చేసుకోవడం కుదరదంటూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 23 మంది బిల్ కలెక్టర్లు వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా పనిచేస్తున్నారు. వీరంతా తాము ఐదేళ్ల నుంచి వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా పనిచేస్తున్నామని, తమకు ప్రాధాన్యత ఇచ్చి నచ్చిన సచివాలయం కేటాయించాలని కోరుతుండగా.. అధికారులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఈ బదిలీల కౌన్సెలింగ్ ఒక కొలిక్కి రావాలంటే సోమవారం వరకు వేచి చూడాల్సిందేనని జీఎంసీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

రెంటచింతల: స్థానిక ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెంటచింతల గ్రామానికి చెందిన నలుగురు యువకులు గాయపడ్డారు. రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీ కొనడంతో గుర్రాల మనోహర్, నాగి తీవ్రంగా గాయపడగా వారిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మాచర్ల ఆస్పత్రికి తరలించారు. కోటయ్య, వెంకటేష్‌లను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపిక

బాపట్ల: జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ ఇంటర్ స్కూల్ జట్ల ఎంపిక పూర్తయిందని సెక్రటరీ దాసరి బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో 16 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. అండర్–14 విభాగంలో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ ప్రథమ స్థానం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయని తెలియజేశారు. అండర్–17 విభాగంలో శాంతి క్రికెట్ అకాడమీ ప్రథమ స్థానం, బాపట్ల అక్స్‌ఫర్డ్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జట్టు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించాయని ఆయన వెల్లడించారు.

నేడు పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గ పరిధిలోని బ్లాక్ బర్లీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే నిమిత్తం రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి సోమవారం పర్చూరు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ అధికారులు తెలిపారు. నియోజక వర్గంలోని జె.పంగులూరు, ఇంకొల్లు, పర్చూరు మండల కేంద్రాల్లో బ్లాక్ బర్లీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. ఆయనతో పాటు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ జె.వెంకట మురళి హాజరవుతారని తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం



అమృలూరు(వేమూరు): బావిలో మహిళ శవం గుర్తించారు. ఎస్ఐ కంచాల రవితేజ తెలిపిన వివరాలు... అమృలూరు మండలం ఇంటూరు గ్రామ పరిధిలోని తిరుపతమ్మ గుడి వద్ద గల బావిలో 50 సంవత్సరాలు మహిళ శవం కనిపించింది. వీఆర్వో యడల ఆదాం సమాచారం మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిఫార్సు బదిలీలు!

- గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్
- అనారోగ్యం, సీనియార్టీ, ర్యాంక్‌తో పనిలేకుండా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖ ఉన్నవారికే ప్రాధాన్యం!
- గుంటూరు సిటీకి వచ్చేందుకు ఒక్కో లేఖకు రూ.50వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు
- ఆందోళనలో మహిళా పోలీసులు



సిఫార్సు ఉన్నవారికే ప్రథమ ప్రాధాన్యం

నెహ్రూనగర్: ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఉంటేనే మొదటి ప్రాధాన్యతగా బదిలీలు ఉంటాయని జీఎస్‌డబ్ల్యూఎస్, పోలీసు అధికారులు తెగేసి చెబుతున్నారు. ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళ పోలీసులకు ఆదివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. అయితే ఈ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా, పారదర్శకత లేకుండా కేవలం సిఫార్సు లేఖలకే ప్రాధాన్యం ఇస్తూ జరుగుతున్నాయని పలువురు మహిళా పోలీసులు ఆరోపిస్తున్నారు.

2019లో సచివాలయ మహిళా పోలీసులకు వచ్చిన ర్యాంకు, వారి అర్హత, టెక్నికల్ క్వాలిఫికేషన్ బట్టి వారికి ఆయా సచివాలయాల్లో పోస్టింగ్ కల్పించారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కేవలం వార్డు టూ వార్డు సచివాలయానికి మాత్రమే బదిలీలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఆ విధంగా కాకుండా ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతానికైనా బదిలీ చేస్తామని అధికారులు తెగేసి చెబుతున్నారు. ఒక వేళ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఉంటే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఖరాకండిగా చెబుతుండంతో సిఫార్సు లేఖలు తెచ్చుకోలేని మహిళా పోలీసుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అనారోగ్యం, సీనియార్టీ, ర్యాంక్‌తో పనిలేదు?

ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో మొదటి ప్రాధాన్యతగా దివ్యాంగులకు, వితంతువులకు, కిడ్నీ మార్పిడి, క్యాన్సర్ వంటి రోగులతో పాటు, స్పౌజ్ కేటగిరి వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. కేవలం ఎమ్మెల్యే సిఫార్సు లేఖలే పనిచేస్తుండడంతో చాలా మంది అర్బన్‌లో పనిచేస్తున్న మహిళా పోలీసులు రూరల్‌కు బదిలీ అవుతామేమోనని భయాందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు.

ఒక్కో లేఖకు రూ.50వేల దాకా వసూలు

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 1100 మంది దాకా మహిళా పోలీసులు ఉన్నారు. వీరందరికీ ఆదివారం కౌన్సెలింగ్ జరిగింది. అయితే ఇందులో రూరల్ ప్రాంతంలో పనిచేసే మహిళ పోలీసులు అర్బన్ ప్రాంతానికి వచ్చేందుకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఒక్కో సిఫార్సు లేఖకు రూ.40వేల నుంచి రూ.50వేల దాకా వసూలు చేసి ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేల దగ్గర నుంచి గుంటూరు నగరంలో పోస్టింగ్ కోసం ఒక్కో మహిళా పోలీస్ 5 నుంచి 10 దాకా వారి వారి స్థలాలకు వెళ్లి బట్టి తెచ్చుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జగన్ పర్యటనలు అడ్డుకునేందుకు బాబు కుట్ర



వెంకటరెడ్డి అభినందన సభలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు



వెంకటరెడ్డి, రాంబాబు, అశోక్‌బాబును సన్మానిస్తున్న కార్యకర్తలు

గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు

మందూరు(వేమూరు): మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక కుట్రలు చేస్తున్నాడని గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. మందూరు మండలంలోని కారుమూరు రివారి పాలెంలో పార్టీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డికి అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కారుమూరు పాలెం గ్రామానికి చెందిన కారుమూరు వెంకటరెడ్డిని పార్టీ అధికార ప్రతినిధిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నియామకం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలీసులకు తనను ఎలాంటి ఇబ్బందులు లేవని, తన అన్ని వైఎస్సార్ సీపీ కార్యకర్తలేనని

చెప్పారు. వారికి ఏ సమస్య వచ్చినా ఎదురు నిలబడి పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షులు మేరుగ నాగార్జున మాట్లాడుతూ పార్టీ కోసం కష్టాలంలో పని చేసిన కార్యకర్తలకు ఎప్పుడూ గౌరవం ఉంటుందని తెలిపారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరు గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా సూపర్ సిక్స్‌లు అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే పథకాలు అమలు చేసిన ఘనత దక్కిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు పక్కన పెట్టి కక్ష సాధింపు చేవరిపాలన చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర కళాకా

రుల సంఘం ప్రధాన కార్యదర్శి దలంద్ర సుధారాణి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హిజ్రాలకు గుర్తింపు ఇచ్చిందన్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు కోసం హిజ్రాలంతా కృషి చేస్తారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా పాలన సాగిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉయ్యూరి అప్పిరెడ్డి, మండల అధ్యక్షుడు అన్నపురెడ్డి రఘురామిరెడ్డి, వేమూరు, అమర్తలూరు మండలాల పార్టీ అధ్యక్షులు దాది సుబ్బారావు, హిమ చంద్ర శ్రీనివాసరావు, ఎంపీపీ ఎలెంటి రుబెను, రాష్ట్ర నరేంద్ర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొగంటి లవకుమార్, జెడ్పీటీసీ సభ్యులు దాట్ల సౌజన్య మోహన్ రెడ్డి, బి. నాంచారయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చెరుకుపల్లిలో జాబ్‌మేళా

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో మదర్‌సన్ ప్రైవేటు లిమిటెడ్, డ్రాక్స్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, గోదావరి ఆంధ్ర కో–ఆపరేటివ్ సొసైటీ, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, హీరో మోటార్స్ వంటి ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై ఎంపికలు చేస్తారని పేర్కొన్నారు.ఆయా సంస్థల్లో 400లకు పైగా ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్హతను బట్టి జీతభత్యాలు ఉంటాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన కోరారు. ఆధార్‌కు మొబైల్ లింక్ అయిన ఫోన్ నంబరును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8008863095 నంబరును సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

అమరావతి: మండలంలోని ధరణికోట గ్రామపరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... మల్లాదికి చెందిన బుల్లా కుమార్ (32) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై అమరావతి నుంచి మల్లాది వెళుతున్నాడు. ధరణికోట ఆర్‌వీవీఎన్ కాలేజీ సమీపంలో రోడ్డుపై వెళుతున్న గేదెను ఢీకొని కిందపడి తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న అమరావతి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

టీడీపీలో అంతర్గత విభేదాలు

నరసరావుపేటటౌన్: అధికార పార్టీలో అంతర్గత విభేదాలు వార్డు టీడీపీ ఇన్‌చార్జిపై దాడికి దారితీసింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డిపేటకు చెందిన బొర్రావుల శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి పదవితో పాటు 20వ వార్డు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నాడు. అదే వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు బత్తుల రాజశేఖర్‌తో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి బంధువు ఇంటికి వెళ్తున్న శ్రీనివాసరావును కొందరు వెంబడించి తెలుగుదేశం పార్టీ పరంగా రాజశేఖర్‌కు వచ్చే పనులను అడ్డుకుంటున్నావంటా, నీ అంతు చూస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయంపై శ్రీనివాసరావు తన స్నేహితులతో కలిసి రాజశేఖర్ ఇంటికి వెళ్లి వాగ్వివాదానికి దిగాడు. దీంతో శ్రీనివాసరావుపై రాజశేఖర్, ఆతడి భార్య రాళ్లతో దాడి చేశారు. దీంతో పాటు దాడిలో గాయపడ్డాగా శ్రీనివాసరావు చేయి అడ్డుపెట్టడంతో వేళ్లు తెగాయి. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.విజయ్ చరణ్ ఆదివారం తెలిపారు.

నేడు ఉర్దూ బాలుర కళాశాలలో సీట్ల భర్తీ ప్రక్రియ

గుంటూరు ఎడ్యుకేషన్: నంది వెలుగురోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను సోమవారం అర్హులైన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో ఏడు, బైపీసీలో 19, సీఈసీలో 18 చొప్పున ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన బీసీ(బీ), బీసీ(ఈ) కేటగిరీలకు చెందిన పేద ముస్లిం, మైనార్టీ విద్యార్థులు సోమవారం సాయంత్రంలోపు కళాశాలకు నేరుగావచ్చి ప్రవేశం పొందాలని సూచించారు.

సంగీత పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నగరంపాలెం: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల (2025–26) విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక గాత్రం, వీణ, వయోలిన్, డోలు, మృదంగం, కూచిపూడి నృత్యం, నాదస్వరం విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు జూలై 1, 2025 నాటికి పదేళ్లు పైబడి ఉండాలని, డిప్లొమా కోర్సులో చేరేందుకు సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసి జూలై 1, 2025 నాటికి 15 ఏళ్లు పైబడి ఉండాలని తెలిపారు. వయోపరిమితి లేదని, ఆసక్తి ఉన్న గృహిణులు, ఉద్యోగులు, విద్యార్థులు అర్హులేనన్నారు. మరిన్ని వివరాల కోసం గుంటూరు శ్యామలానగర్‌లోని డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని తెలిపారు.

వ్యాపారవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత



ప్రమాణ స్వీకారం చేస్తున్న జయకుమార్

గుంటూరు మెడికల్: వ్యాపార వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అన్నారు. ఐటీసీ నవ్యాంధ్ర ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గుడివాడ జయకుమార్, కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, కోశాధికారి వై.బి.శివారెడ్డిల ప్రమాణ స్వీకారం ఆదివారం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పొట్లూరి భాస్కరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. అసోసియేషన్ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గుడివాడ జయకుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. భవి

ష్యత్తులో అసోసియేషన్ తరఫున నూతన భవంతిని నిర్మించి నిరుద్యోగ యువతకు ప్లాస్టిక్ టెక్నాలజీలో మెలకువలను నేర్పించడంతోపాటు, ఉచిత శిక్షణ తరగతులు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు నూతన కార్యవర్గానికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బాపట్ల: ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు కలిగిన పిల్లలు అందర్నీ చేర్పించే బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం బాపట్ల జిల్లా ప్రజా సంఘాల కార్యాలయంలో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఇందులో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో నైతిక, రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలని కోరారు. దీనికి ప్రభుత్వ ఉపాధ్యాయులే ప్రత్యేక కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటులో విద్యార్థుల సంఖ్య పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడిపై సమాజానికి, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు పని విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులంతా జూలై మొదటి వారంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కోసం ప్రత్యేక క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు జక్ విజయ్ కుమార్ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ద్వారా జరిగిన ఇబ్బందులు, ప్రమోషన్లలో అసంబద్ధాలను సరిదిద్దడానికి యూటీఎఫ్ అన్ని సంఘాల్ని కలుపుకొని పెద్దఎ

త్తున పోరాటం చేసిందని, తద్వారా మెజారిటీ ఉపాధ్యాయులకు న్యాయం చేశామని తెలిపారు. బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుసుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగ వికాసం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం పనిచేసే సంఘం యూటీఎఫ్ మాత్రమేనని తెలిపారు. ఉపాధ్యాయులు సభ్యులుగా చేరాలని కోరారు. బదిలీలు, ప్రమోషన్లలో ఉపాధ్యాయులకు ఎదురైన ప్రతి సమస్యను దిత్తుకుపోతో కృషిచేసి పరిష్కరించామని చెప్పారు. అనంతరం ఊరి బడిలో పిల్లల్ని చేర్దామనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు పొపారావు, సహాధ్యక్షులు బిజ్జల బాబు, కోశాధికారి హరిప్రియ, జిల్లా కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్స్, ఆడిట్ కమిటీ సభ్యులు, మండల అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించకపోతే పోరాటాలు

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

బాపట్ల టౌన్: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఆదివారం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల తొలి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు 12 నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చొరవ తీసుకొని వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేంత వరకు ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని తెలిపారు. అనంతరం ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సలహాదారులుగా శ్యామ్యూల్, శ్రీనివా

సరెడ్డి, గౌరవాధ్యక్షులుగా రాహుల్ రావ్, అధ్యక్షులుగా సిహెచ్. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సుధారాణి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఏడుకొండలు, కోశాధికారిగా భారతి, ఆడిట్ మెంబర్స్‌గా సంధ్యారాణి, వెంకటరెడ్డి, నాగేశ్వరమ్మ, విజయ్ కుమార్, శిరీష, సౌజన్యలతో పాటు 15మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సింగర్ కొండా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్యామ్యూల్, రాష్ట్ర నాయకులు సునీల్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో పురుషోత్తం

చీరాల అర్బన్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చీరాలలో పట్టణశాఖ 20వ వార్షికోత్సవ వేడుకలను స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.పురుషోత్తం, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యాయ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఈవో ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల బలోపేతం చేయడానికి ఎన్‌రోల్‌మెంట్ పెంపొందించాలని కోరారు. విద్యార్థులను కష్టపడి చదివేటట్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు మనుగడ ఉపాధ్యాయుల కృషిపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు ఊతమిచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. అనంతరం పేరాల్లోని ఆంధ్రరత్న

మున్సిపల్ హైస్కూల్‌లో 35 సంవత్సరాలు పని చేసి పదవీవిరమణ చేసిన నాగళ్ల రమణారావు దంపతులను సత్కరించారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి గౌరవ సంపాదకుడు నాగేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా బాధ్యులు గడివాడ అమర్‌నాథ్, బడుగు శ్రీనివాస్, కె.ఎర్రయ్య, వి.ప్రభాకరరావు, ఎం.ఏసురత్నం, టి.వెంకటేశ్వర్లు, శ్రీదేవి, పార్వతి, అప్పర, రమేష్, సుబ్బారెడ్డి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం పాత్ర కీలకం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- లీగల్‌సెల్ ఆధ్వర్యంలో అంబటికి సత్కారం



అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని సన్మానిస్తున్న సీపీ లీగల్ విభాగం సభ్యులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి లీగల్ విభాగం ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా పోలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన అంబటిని ఆదివారం సత్కరించారు. అరండల్‌పేటలోని లీగల్ విభాగం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హాజరయ్యారు. ముందుగా న్యాయవాదులు, లీగల్ విభాగం నేతలు అంబటిని సత్కరించి, అభినందనలు తెలిపారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ తనను పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన నేపథ్యంలో లీగల్ విభాగం సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారన్నారు. గతంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు లీగల్ విభాగం కృషి ఎనలేనిదన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ శ్రేణులపై, కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, కూటమి పెట్టే ప్రతి అక్రమ కేసుపై లీగల్ విభాగం ద్వారా న్యాయస్థానాల్లో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సైతం న్యాయవాదుల కృషి ఎంతగానో ఉండబోతోందన్నారు.

మహత్తర శక్తిగా లీగల్ విభాగం

ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కూటమి కుట్రలను ఛేదిస్తూ వైఎ

స్సార్ సీపీ నేతల నుంచి కార్యకర్తల వరకు తాము న్యాయాన్ని ధైర్యాన్ని కలిగిస్తున్న న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి అధికారంలో వచ్చిన తరువాత జరుగుతున్న దారుణాలను ఎదుర్కొనేందుకు ఒక మహత్తర శక్తిగా లీగల్ విభాగం పనిచేస్తోందన్నారు. కర్నూలు ఇరాకోటే రోజుల్లో న్యాయవాదులకు మంచి చేసేలా వైఎస్ జగన్ అనేక గొప్ప నిర్ణయాలు తీసుకుంటారన్నారు. పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం లీగల్ విభాగానికి మరింత పటిష్టం చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. గుంటూరు పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు న్యాయవాదులు ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. కూటమి పాలనలో అనేక అక్రమ కేసులు చూస్తున్నామని, వాటిపై న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్దె భగవాన్, సోమశేఖర్ కృష్ణారెడ్డి, సయ్యద్ కమిల్, సోమసాని రూసిప్, మంచాల, పోకల వెంకటేశ్వర్లు, హబీబుల్లా, వాసం సూరిబాబు, లలిత, వరదారెడ్డి, శ్యామల, ఇందిరా, శ్రీనివాసరెడ్డి, ఫణి, రెడ్డి, సింగ్, బొమ్మసానియని శ్రీను, వజ్జల రాజశేఖరరెడ్డి, బ్రహ్మారెడ్డి, కాసు వెంకటరెడ్డి, క్రాంతి, మేదలి ప్రసాద్, స్వప్రేస్, తార, అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు జమ చేయాలి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే దారి మళ్లించిన నిధులను పంచాయతీలకు జమ చేయాలని వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఆలా ఎల్లీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ రూపొందించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమస్యపై సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని సర్పంచులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పంచాయ

తీలకు రావాల్సిన జనరల్ ఫండ్స్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులను తల్లికి వందనం పథకానికి దారి మళ్లించారని చెప్పారు. పనికి ఆహార పథకంలో ఉన్న కూలీలకు పేస్లిప్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు, సగం కూలీ డబ్బులు తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్జల వజ్రారెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు సంబంధించిన నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దీనిపై ఒక పంచాయతీలో పోరాటం చేస్తామని తెలిపారు. పరిస్థితిని గమనించి ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.